# స్వర్ణాక్షరాల చరిత్ర

సిద్ధాంతమ్మ ఏదన్నా, రాద్ధాంతమ్మ కాదంటుంది, లేదంటుంది. ఇటువంటి దెక్కడా సంభవించదంటుంది. పచ్చి కోత అంటుంది. తర్కం చేస్తూ మల్లవీరునికి మల్లే సవాల్ చేస్తానంటుంది. ఆవిడ కంత పట్టుదల, మొండి శిఖండి. తన మాటే నెగ్గాలని శఠం. దానికి తోడు ఆమె నోట్లో నోరు పెట్టగల సత్తా ఎవ్వరికి లేదు. ఆవిడ బాహాటంగా చాటుతుంది - తనతో ఎవ్వరూ యుద్ధం చెయ్యలేరంటూ : మగవాళ్ళతో సరిసమానంగా ఎదిరిస్తుంది. రాద్ధాంతమ్మకు యిన్ని క్వాలిపికేషన్స్ వుండటానికి కారణం ఆమె గంగా భాగీరధీ సమానురాలు. విధవ : విధవలకేమీ ఊసుపోదు గదా! వాళ్లే అమ్మలక్కలు. అక్కర్లేని ఊళ్ళో అన్ని భోగట్టాలూ వాళ్ళకే కావాలి.

రాద్ధాంతమ్మ, యింటద్దె సరిగ్గా నెలకు నెలాచలామణి చేయదు. ఇంటాయన- "అవసరంవుందని బ్రతిమాలితే, అప్పటికి రాద్ధాంతమ్మ విసురుగా - "అంత తొందరపడితే ఎల్లాగండీ? మొన్ననేగా ఫస్టెల్లింది : లెఖ్ఖ చేతికందాలా మరి? మీక్కావల్సినప్పుడే మా దగ్గరుంటుందా? కొన్నాళ్ళపాటు ఆగాలి: " అని తప్పించుకు పోతుంది. ఇంటాయన కిక్కురుమనలేడు. అంటే పులినోట్లో తల దూర్చినట్టే!

రాద్ధాంతమ్మ, కాస్త చనువుగానూ, చొరవగానూ సిద్ధాంతమ్మతోనే మాట్లాడుతుంది. దానిక్కారణం ఇరుగూ, పొరుగూ, అయినా సిద్ధాంతమ్మతో వాదిస్తుంది. ఇద్దరూ రాత్రి తొమ్మిది గంటలదాకా ఎకాఎకీని హస్కు కొడతారు. సరిగ్గా తొమ్మిదీ అయ్యేసరికి సిద్ధాంతమ్మ భర్త వస్తాడు. ఆయన రాగానే సిద్ధాంతమ్మ "మళ్ళీ రేపు కలుద్దాం" అంటూ భర్తకు వడ్డన చెయ్యడానికి లోనికి పోతుంది. దాంతో రాద్ధాంతమ్మ మొహం వెలవెల బోతుంది. మొహం చిట్లించుకుంటుంది. " ఈ సిద్ధాంతమ్మకు ఈ

మొగుడెక్కడ దాపురించాడో! ఛస్తే బావుణ్ణు!" అని సణుక్కుంటుంది ఎందుకంటే వాళ్ల అమూల్యమైన పిచ్చాపాటికి అంతరాయం కలిగించినవాడు సిద్ధాంతమ్మ భర్తకాబట్టి రాద్ధాంతమ్మతో ఎంత స్నేహంవున్నా కొంత చెడ్డతలపెడుతుంది. ఆమెకు ద్వేషం లేదు. ఉన్నదల్లా ఈర్ష్య. తనకు మల్లే సిద్ధాంతమ్మ బొట్టు చెరిగి పోవాలని రాద్ధాంతమ్మ. ఇలా ద్రోహం తలపెట్టే మనిషిని. పాపం సిద్ధాంతమ్మకు తెలియదు. మామూలుగా ఏదో కలిసికట్టుగా మాట్లాడుతూందనుకుంటుంది కాని, రాద్ధాంతమ్మ మనోద్దేశాలు ఆమెకేం తెలుసు?

ఒకనాటి ఉదయం పది గంటలకు భర్త ఆఫీసుకు పోగానే రాద్ధాంతమ్మను కలిసింది సిద్ధాంతమ్మ.

"ఏమిటి సంగతులు?" అంది రాద్ధాంతమ్మ.

'ఏమున్నాయ్? నిన్ననే నన్నాయన షావుకారు సినిమాకు తీసికెళ్ళారు..."

"నే ననుకుంటూనే వున్నాను. అదే ఎందుకు రాత్రి కబుర్లు చెప్పడానికి రాలేదూ అని? ఆహా! అయితే మొత్తానికి సినిమా ఎలా వుందంటారు?"

"ఎంతో బావుంది. మీరూ వస్తే బావుణ్ణు అనుకున్నాను. కాని మా ఆయనున్నారు! లేకపోతే మిమ్మల్ని పిలుద్దును" అంది సిద్ధాంతమ్మ.

రాద్ధాంతమ్మ సహించలేకపోయింది. ఏదో ఒక లొసుగు పెట్టదలచింది.

"సినిమా బావుందనేనా మీ రనేది? బాగంటే ఎలాంటి బాగు?" అంటూ విమర్శకు లంకించుతుంది.

సిద్ధాంతమ్మ హడలిపోయింది. రాద్ధాంతమ్మతో బావుందని చెప్పినా, బావులేదని చెప్పినా ప్రమాదమే. సినిమా బావులేదంటే "ఎందుకు బావులేదు మీకర్థం కాలేదేమో? ఏమి టందులో బావులేని ఘట్టం?" అని రణాయిస్తుంది. బావుందంటే పై విధంగా అడుగుతుంది. ఏదీ చెప్పకపోతే కోపం. పైగా 'ఆ మాత్రం దానికి చూడ్డం ఎందుకు?' అని దెప్పి పొడుస్తుంది.

"నా కందులో ముఖ్యంగా అర్థమయిన నీతి ఇరుగు పొరుగులు చీటికి మాటికీ అనవసర కయ్యాలు పెట్టుకోవద్దనీ..." అంది సిద్ధాంతమ్మ.

ఇహ రాద్ధాంతమ్మ పట్టుకుంది:

"యిరుగు, పొరుగులు చీటికీ, మాటికీ కయ్యాలు పెట్టుకోరాదంటే అప్పుడప్పుడు పెట్టుకోవచ్చు నన్నమాట  అంతేకదూ?"

సిద్ధాంతమ్మ మాట్లాడలేదు.

"అనవసర కయ్యాలు కూడదంటే, అవసరం వుంటే కయ్యం ఆడవచ్చునన్నమాట: ఏవంటారు?

సిద్ధాంతమ్మకు ముచ్చెమటలూ పోస్తున్నాయ్.

"ఇరుగు పొరుగులవారు ఝగడాలు కూడదంటే, ఇరుగుకూ పొరుగుకూ అవతలవాళ్ళ ఇవతలవాళ్ళ ఝగడాలు ఆడవచ్చునన్న మాట! ఏం మాట్లాడరేం?"

సిద్ధాంతమ్మ బిక్కచచ్చిపోయింది.

"అబ్బా! మీతో వాదించలేనండీ: వొస్తాను, ఇంకా ఎంగిళ్ళూ అవీ ఎత్తాలి." అంటూ ఇంట్లో దూరి తలుపులు బిడాయించింది.

రాద్ధాంతమ్మ, నా అంతటి ధీమంతురాలు మరి వుండబోదన్నట్లు గర్వంగా - సిద్ధాంతమ్మ యింటివేపు చూస్తూ తలకాయ తిప్పింది. ఆమె దుర దృష్టంవల్ల మీసాల్లేవు. ఉంటే ఎగదువ్వి వుండేది.

"ఈయేడు మా పాపను బ్రాంచి స్కూలులో ఫస్టు ఫారంలో పడేస్తా నంటున్నారు ఆయన..." అంది సిద్ధాంతమ్మ.

"మా గంగాధరాన్నీను...." అంది రాద్ధాంతమ్మ చటుక్కున.

"మీవాడింకా నాలుగు పాసై అయిదులోకి వొస్తాడు కాబోలు!" అంది సిద్ధాంతమ్మ బుగ్గమీద వేలేసుకుని.

"ఏవీ అయితే?... మీ పాపో?"

"అది అయిదుపాసై ఆరులోకి వసస్తాంది. అందుకే ఫస్టుఫారంలో పడేయదలచాము."

"మావాడు నామకా నాలుగులోంచి అయిదులో కొస్తున్నా, వాడికున్న తెలివితేటలు ఎవరికున్నాయ్ గనక! ఫస్టుఫారం లెఖ్ఖలు నోటితో కట్టేస్తాడు" అంది రాద్ధాంతమ్మ.

సిద్ధాంతమ్మ తెల్లబోయింది. ఒక్క క్షణం ఊరుకుని బుర్ర దించుకుని విస్తళ్ల కుట్టనారంభించింది.

సిద్ధాంతమ్మకు "పాప" అని ఒక్కగానొక్క కూతురు. కాస్త తెలివిగా చదువుతుంది. ఈ యేడాది ఫస్టుఫారంలోకి వస్తుంది. పాప, రాద్ధాంతమ్మ కొడుకు గంగాదరం, దాదాపు ఒకే యీడువాళ్ళు. పాపే ఆరునెలలు పెద్ద. ఇద్దరూ కలిసి మెలసి తిరుగుతూంటారు. చదువులో మాత్రం గంగాధరం దిట్టకాడు. మొదట్నుంచీ పాప, గంగాధరంకంటె ఒక క్లాసు ఎక్కువ చదవడం, రాద్ధాంతమ్మకు నచ్చలేదు. ఎలాగైనా యిద్దరూ ఒకే తరగతిలో వుండాలని గునుపు. కొంచెం కన్నెర్రగా కూడా వుంది.

ప్రతి యేడాది బ్రాంచి స్కూలులో, కొత్తగా ప్రవేశించేవారికి చిన్నచిన్న పరీక్షలు చేస్తారు. అర్హతనుబట్టి తరగతి నిర్ణయిస్తారు. అందులో ఫస్టుఫారంలో చేరదలచినవారు, ఇంకేదైనా స్కూల్లో అయిదో తరగతి పాసు కానక్కర్లేదు. మొదటిసారిగా అందులో ప్రవేశించి, పరీక్షలో నెగ్గి, చదువు చక్కగా కొనసాగించవచ్చు.

"ఇదే అదను" అనుకుంది రాద్ధాంతమ్మ - "ఇహ మన నక్కజిత్తుల రాజకీయాలకు అడ్డెవ్వరొస్తారో చూస్తాను! ఇలాగే సిద్ధాంతమ్మకు టోపీ వేస్తాను" అని గర్వించింది.

"ఏమోయ్ సిద్ధాంతమ్మా! ఓ సారిల్లా వీధిలోకి రావమ్మా!" అని గేలి చేస్తున్న స్వరంతో సిద్ధాంతమ్మ యింటికెదురుగా నడివీధిలో నించుని పిలిచింది రాద్ధాంతమ్మ .

సిద్ధాంతమ్మ యింట్లోంచి ఏ సమాధానమూ లేదు.

"ఇలా రావమ్మా! పైకి - ఇంతట్లో నీకేమీ కీడు మూడదులే! ఎవరిపంతం నెగ్గిందో చూద్దువుగాని."

సిద్ధాంతమ్మకు ఈ మాటలు వినీ వినబడనట్లు వినబడ్డవి. తలుపులు తెరచి-"ఏవమ్మా! పిలిచారా?" అంది.

"ఓస్! అమాయికపుదానా? ఏమీ ఎరగనట్లే మాట్లాడుతున్నావు?"

"ఒట్టు, నే చచ్చినట్టు! వినబడలేదమ్మా! ఏమిటి విశేషం?"

"ఉన్నదున్నట్లు మూడు వాక్యాల్లో చెప్తాను. మావాణ్ణి ఫస్టుఫారంలో పడేస్తానని

చెప్పానే! వాడు, వాళ్ల చేసిన పరీక్షలో నెగ్గాడు. ఫస్టుఫారంలో ప్రవేశిస్తున్నాడు. ఇదీ మావాడి, స్వర్ణాక్షరాలతో వ్రాయదగ్గ చరిత్ర!" అని గుక్క తిప్పకుండా ఏకధాటీని వల్లవేసింది. "రారా అబ్బాయి! రా! ఇక పైనుంచీ నువ్వూ, పాప కలిసే చదువుకోవచ్చు. నీకు జిల్‌ఫ్రూట్ కావాలా? ఐస్‌క్రీమ్ కావాలా? అదిగో నీక్కావలసింది తీసుకో!" అని దగ్గరున్న గంగాధరాన్ని ఒళ్ళోకి తీసుకుంది.

సిద్ధాంతమ్మకు చలనం లేదు. అతి అమాయికంగా :

"ఇదేనటమ్మా విశేషం?ఏమిటో అనుకున్నాను. మాపాప పరీక్షకెళితే, ఇది బాగా చదువుతుందని, దీనికి మంచి భవిష్యత్ వుందని, వాళ్ళ హెడ్మాస్టరు గారు స్వయంగా సెకండుఫారంలో ప్రవేశపెట్టారు!" అని దభాలున తలుపు వేసుకుంది!!

ఆంధ్రప్రభ వీక్లీ 12-8-53